క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: హైదరాబాద్‌లో అయిజ మండలానికి చెందిన జనార్దన్ గౌడు ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు అందజేశారు. కార్యక్రమంలో అయిజ కౌన్సిలర్ సురేష్, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గోపాల్, తదితరులు ఉన్నారు.

'రైతుబీమా'కు దరఖాస్తు చేసుకోవాలి

అలంపూర్ రూరల్: మండలంలోని రైతులు ఆగస్టు 5వ తేదీలోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని గురువారం ఏఓ అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబీమా కోసం జూన్ 28, 2024 వరకు పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులతో పాటు గతంలో పాసుపుస్తకం ఉండి ఇప్పటి వరకు రైతుబీమా చేయించుకోని రైతులు ఆగస్టు 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు దరఖాస్తు పత్రం, పట్టాపాసు పుస్తకం, రైతు ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలతో ఆయా వ్యవసాయ విస్తర్ణాధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఏఓ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

మానవపాడు: మండల కేంద్రంలో ఓ అధికారి యువకుడిని కులం పేరుతో దూషించిన ఘటనలో జూలై 16న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసుపై అట్రాసిటీ కేసు మండల కేంద్రలో నమోదైంది. గురువారం ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ సత్యనారాయణ ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులను పిలిపించి విచారణ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం

– ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలు

గద్వాల రూరల్: వీధికుక్కలు స్వైరవిహారం చేసి ఇద్దరు చిన్నారులను తీవ్రంగా గాయపర్చిన ఘటన గురువారం సాయంత్రం గద్వాల మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గద్వాల పట్టణంలోని 3వ వార్డుకు చెందిన అశ్విత(15నెలలు), రిషి(6ఏళ్లు)లు ఇంటి పరిసర ప్రాంతంలో ఆడుకుంటుండగా వీధికుక్కలు వారిద్దరిపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాయి. ఇద్దరు చిన్నారులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వారిని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, వెంటనే కుక్కల బెడద లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

ప్రిన్సిపల్‌కు ఘన సన్మానం



ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 11 ఏళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. గురువారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, రవి, రాజేశ్వర్, తులసీ, వీరేష్, బీచుపల్లి, గుణశేఖర్, జయన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్‌ఐని సన్మానించిన నాయకులు

ధరూరు: మండలానికి కొత్తగా వచ్చిన ఎస్‌ఐ అబ్దుల్ సుకూర్‌ను గురువారం పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ నాయకులు సి. రాముడు, ఎస్సీ సెల్ మండల నాయకులు ఏసన్న, కుర్వ సంఘం మార్లబీడు అధ్యక్షులు నర్సింహులు, ఆశిరెడ్డి ఎస్‌ఐని కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

ధరూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పని చేసి బదిలీ అయిన ఆర్‌ఐ లతీఫ్‌ను, అటెండర్ శ్రీనులను ఘనంగా సన్మానించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకట్రావ్, సిబ్బంది నాగేష్, సామాజిక కార్యకర్త అంజి సాగర్ తదితరులు శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా లక్ష్మారెడ్డి

అయిజ: అయిజ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కమిషనర్ సత్యంబాబు ఉద్యోగ విరమణ చేయడంతో అతని స్థానంలో గురువారం ఇన్‌చార్జ్ మున్సిపాలిటీ కమిషనర్‌గా లక్ష్మారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. నిబంధనలు మేరకు పనులు సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

రహదారులు అస్తవ్యస్తం

- మరమ్మతులకు నోచుకోని గ్రామీణ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, రైతులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బురదగా మారిన సద్దలోనిపల్లి - మంగంపేట రహదారి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఉన్న ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. రోడ్లపై పెద్దపెద్ద గుంతలు, మురుగు నిలిచిపోవడంతో పాటు రోడ్లకు ఇరువైపుల కంపచెట్లు పెరిగాయి. మండలంలోని సద్దలోనిపల్లి నుంచి మంగంపేట రహదారిలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు అదుపు తప్పి గుంతలలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. సద్దలోనిపల్లి నుంచి అమరవాయి వరకు ఉన్న రహదారిపై రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరగడంతో రోడ్డుపై ఎండ్లబండ్లు, వాహనదారులు వెళ్లేందుకు ఇబ్బందులున్నాయి. బిజ్వారం నుంచి దసర్‌పల్లి వరకు ఉన్న రహదారిపై గుంతలు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బిజ్వారం–సంగాల వరకు ఉన్న రహదారి అస్తవ్యస్తంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్దకల్ –అడవిరావులచెర్వు, ఉలిగేపల్లి–అడవిరావల్ చెర్వు, మద్దెలబండ–నేతువానిపల్లి, బూడిదపాడు–బిజ్వారం వరకు ఉన్న రహదారుల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గతంలో రోడ్డుపై ఏర్పాటుచేసిన కంకర, మట్టి తెలడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెద్దపల్లి - పావనంపల్లి, ఎల్కూర్– ఈదులపల్లి మీదుగా చర్లగార్లపాడు వరకు ఏర్పాటు చేసిన రోడ్డుపై బీటీ ఏర్పాటు చేయకపోవడంతో కంకర రోడ్డుపై ప్రతిరోజు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గట్టు మండలంలోని వివిధ గ్రామాల రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కేటీదొడ్డి, ధరూర్, గద్వాల మండలలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు మరమ్మతులకు నోచుకోకపోడంతో వాహనదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.



అమరవాయి - సద్దలోనిపల్లి వెళ్లే రహదారి

చర్యలు తీసుకుంటాం..



మండలంలోని వివిధ గ్రామాల రహదారులు గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా ఉండడంతో పంచాయతీ రాజ్ ఏఈ బషీర్ దృష్టికి తీసుకెళ్లాం. రోడ్లను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. నిధులు మంజూరైన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– చెన్నయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ, మల్దకల్

ప్రమాదాల బారిన పడుతున్నాం



మంగంపేట గ్రామ రహదారి గుంతలలో నీరు నిలవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఈ రహదారిపై వివిధ గ్రామాల వాహనదారులతో పాటు రైతులు ఎండ్లబండ్లపై తమ రాకపోకలు సాగిస్తారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– వెంకటేశ్వర్లు, సద్దలోనిపల్లి

రోడ్డుపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలి



అమరవాయి నుంచి సద్దలోనిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై పెద్ద గుంతలు ఉండడంతో ప్రతిరోజు ఇబ్బందులు పడుతున్నాం. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు పెరగడంతో రాకపోకలకు ప్రతిరోజు అవస్థలు తప్పడంలేదు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు.

– తిమ్మన్న, అమరవాయి

సమస్యను పరిష్కరించాలి



ప్రతినిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నా అధికారులలో ఎలాంటి చలనం లేదు. ఇప్పటికైనా అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– రామాంజనేయులు, మల్దకల్

సుప్రీంకోర్టు తీర్పుపై సంబురాలు



అలంపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



గద్వాలలో మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అలంపూర్: ఎస్సీ వర్గీకరణపై దేశ సర్వోన్నత ధర్మాసనంలో ఇచ్చిన తీర్పుపై నాయకులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. అలంపూర్ పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ఆయా రాజకీయ పార్టీల, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు సుప్రీం కోర్టు తీర్పుపై సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబ సాహేబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ 30 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పీ జాన్, పెద్దబాబు, డి సురేష్, జీ. బాబు, నరసింహ, ధర్మచక్ర, రాముడు, బాబు ఉన్నారు.

మాదిగల పోరాట ఫలితమే..

మాదిగల పోరాట ఫలితమే ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందని ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. అలంపూర్ చౌరస్తాలో ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగా ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లు పోరాటం చేశారన్నారు. సర్వోన్నత న్యాయం స్థానం తీర్పు తర్వాత సీఎం రేవంత్ రెడ్డి శాసన సభలో వర్గీకరణ అమలు చేస్తామని చెప్పడంతో కృతజ్ఞతలు తెలిపారు.

మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

గద్వాల అర్బన్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమార్పీఎస్, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు అతిఖుర్ రహ్మాన్, సుబాన్, రామాంజనేయులు, ఇమ్మానియేల్, కురుమన్న, రాజేష్, పాల్వాయి రంజిత్ ఉన్నారు.

ధరూరు: ఎస్సీ వర్గీకరణ కోరుతూ చేపట్టిన 30 ఏళ్ల తరువాత ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడడంతో మండలంలో దళిత సంఘాల నాయకులు సంబురాలు నిర్వహించారు. నెట్టెంపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, బాణా సంచా కాల్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు సాయిలు, మండల కార్యదర్శి గోవిందు పరశురాముడు పాల్గొన్నారు.

మానవపాడు: మండలకేంద్రంలోని అమరవాయిలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా ఇవ్వడం హర్షనీయమని యువ నాయకుడు వేల్పుల రవి తెలిపారు.

అయిజ: ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సంబురాలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంకాపురం రాముడు, వెంకటేష్, రాజు, రామలింగం, వీరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

శాంతినగర్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా పోరాటం చేసి సాధించిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి శాంతినగర్‌లో పాలాభిషేకం చేశారు.

గద్వాల రూరల్: 30ఏళ్లుగా ఎస్సీ ఏబీసీడీల వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటం సుప్రీంకోర్టు తీర్పుతో ఫలించిందని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆర్.మోహన్ అన్నారు. సమాజంలో అణచివేతకు గురవుతున్న కులాలకు వర్గీకరణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.


స్పందించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని 'శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆస్మా గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దెభవనం దొరికిన వెంటనే మార్చాలని అంగన్‌వాడీ టీచర్ సుమిత్రకు సూచించారు. చిన్నారుల తల్లిదండ్రులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఇనాందారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్



అలంపూర్: ఇనాందారుల సంఘం జిల్లా అధ్యక్షుడి గా పీవీ శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గత నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని శ్రీ వైష్ణవ సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇనాందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కారంపూడి నర్సింహ్మాచార్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రిష్ణయ్యల ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన పీవీ శ్రీధర్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సురేష్ కుమార్ శర్మతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహం నిశ్చయమైన యువతి అదృశ్యం



ఉండవెల్లి: పెళ్లి నిశ్చయమైన యువతి అదృశ్యమైన సంఘటన గురువారం అలంపూర్ చౌరస్తాలోని వెంకటసాయి నగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మానవపాడు మండలం గోకులపాడుకు చెందిన బోయ మద్దిలేటి కుటుంబంతో అలంపూర్ చౌరస్తాలోని వెంకటసాయినగర్‌లో నివాసముంటున్నారు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మూడు నెలల క్రితం పెద్ద కుమార్తె రేణుకకు మానవపాడు మండలానికి చెందిన అశోక్ కుమార్ నాయుడుతో వివాహం నిశ్చయమైంది. వారం క్రితం అశోక్ నాయుడు ఫోన్ చేసి త్వరగా వివాహం చేయాలని కోరాడు. దీంతో తమతో డబ్బులు లేవని, డిసెంబర్‌లో డబ్బులు వచ్చాక చేస్తామని మద్దిలేటి పేర్కొన్నాడు. ఈ క్రమంలో జూలై 31న సాయంత్రం అందరు ఇంట్లో ఉన్న సమయంలో రేణుక బయటకు వెళ్లింది, తిరిగి ఇంటికి రాలేదు. దీంతో మద్దిలేటి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ శివప్రసాద్

అలంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించాలని ఉండవెల్లి ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి పాఠశాలలో గురువారం ఉండవెల్లి, మానవపాడు మండలాల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. జాతీయ అర్హత సర్వే పరీక్షల నిర్వాహనపై ఆర్‌పీలు వివరించారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సామర్థ్యాలు పెంచేవిధంగా బోధన అందించాలన్నారు. నవంబర్‌లో విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకోవడానికి పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం బదిలీపై కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. సమావేశంలో మండల నోడల్ ఆఫీసర్స్ రామకృష్ణ, విష్ణు, హెచ్‌ఎం హేమలత, అనితబాయి, ఆర్‌పీలు ఉన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మల్దకల్: విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌బీఎస్‌కే డాక్టర్ విజయ్‌కాంత్ సూచించారు. గురువారం మండలంలోని పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు మాట్లాడుతూ విద్యార్థులు భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సమీనా, కౌజర్, హెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు నాగరాజు, దస్తగిరి, ఊర్మిళ పాల్గొన్నారు.

పుట్టినబిడ్డకు ముర్రుపాలు తప్పనిసరి



గట్టులో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్యారాణి



తక్కశిలలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

గట్టు: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టించాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సంధ్యారాణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో పాటుగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. హాబ్ స్వచ్ఛంద సంస్థ, సఖి సెంటర్ నిర్వాహకులు, చైల్డ్ లైన్ సంస్థ వారు మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వాటి నివారణకు తీసుకోవల్సిన చర్యలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖి సెంటర్ శోభరాణి, చైల్డ్ లైన్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, సరస్వతి, రాజేశ్వరి ఏఎన్‌ఎం పార్వతి, ఆశా వర్కర్లు సరళ, రంగమ్మ, పద్మ, హాబ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి ముర్రుపాలు తప్పకుండా తాగించాలని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరమేశ్వరి అన్నారు. ఇటిక్యాల మండలం ఉదండాపురంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలన్నారు. దీని వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పద్మమ్మ, పుష్పవతి, సుంకులమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఏఎన్‌ఎం నర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. తక్కశిలలో చిన్నారులకు, వృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుసిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు సత్యమ్మ, ఎర్రమ్మ, చంద్రిక రాణి, ఆశాలు పాల్గొన్నారు.

మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలి



సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల గురించి అభ్యంతరకరంగా మాట్లాడిన తీరును మొత్తం మహిళాలోకాన్నే కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. వెంటనే మహిళ ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గట్టు మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల, నాయకులు హనుమంతు నాయుడు, బస్వరాజు, రాము, హుస్సేన్ మక్బుల్, అన్వర్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల అరెస్ట్

అయిజ: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించిన నాయకులను ఎస్‌ఐ విజయభాస్కర్, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని శాసన మండలిలో అవమాన పరిచేవిధంగా మాట్లాడినందుకు సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్వీ కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, ప్రేమలత, చిన్న రాజు, రమేష్ పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు తగవు

గద్వాల రూరల్: ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెరలేపిన బ్లాక్ మెయిల్ రాజకీయాలు తగవని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి రెండు రోజులుగా నడిపిన హైడ్రామాతో ఎవరిని వరించడానికి అని ప్రశ్నించారు. జిల్లా మంత్రి అబద్దాలతో ఈ డ్రామాలు ముగించడం వెనుక ఎటువంటి కుట్ర దాగి ఉందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. డ్రామాలు మానుకోని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు అతిఖుర్ రహ్మాన్, ప్రేమలత, మక్బుల్, ముని, కుర్వ పల్లయ్య ఉన్నారు.

పోరాటంతోనే డబుల్‌బెడ్రూంలు సాధిద్దాం



సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: ప్రజా పోరాటాలతోనే డబుల్ బెడ్రూం ఇండ్లను సాధించుకోగలమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ నగర్, రాంనగర్, జమ్మిచేడు, మోమిన్ మహెల్లా కాలనీల్లో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తయినా, వాటిని లబ్ధిదారులకు అందజేయడంలో జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అర్హులైన లబ్ధిదారులకు డబుల్‌బెడ్రూంలు పంపిణీ చేయాలన్నారు. సీపీఎం చేస్తున్న పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గజేంద్ర, కల్యాణ్, రాము, విష్ణు, వెంకటేష్ ఉన్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఈ నెల 3, 4వ తేదీలలో నాగర్ కర్నూల్‌లో నిర్వహించే ఏఐటీయూసీ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి ఆశన్న పిలుపునిచ్చారు. గురువారం జింకలపల్లి స్టేజీలో హమాలీ కార్మికులతో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. శిక్షణ కార్యక్రమంలో కార్మికుల హక్కులు, విధులు, కార్మిక చట్టాలు, రక్షణ, భద్రత, తదితర అంశాలపై నిపుణులతో అవగాహన, చైతన్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. మండలాల నుంచి కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు పరశురామ్, నాగరాజు, బీచుపల్లి, ఆంజనేయులు, వెంకటేష్, రాము, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవికి అభినందనలు



మాట్లాడుతున్న ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు

గద్వాల అర్బన్: గద్వాల అభివృద్ధికి పాటుపడుతున్న ఎంపీ మల్లు రవికి సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడారు. కేంద్ర రైల్వే బడ్జెట్‌లో గద్వాల రైల్వేస్టేషన్ పరిధిలో 100ఎకరాల భూమి ఉందని, అందులో విద్యాసంస్థలు, సూపర్‌స్పెషలిటీ ఆస్పత్రి, రైల్వే ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేయాలని, నీతి అయోగ్‌కు ప్రతిపాదించిన అంశాలపై సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఎంపీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ అంశాలను ఎంపీ పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్ నిధులు, గ్రాంట్స్ అంశం చర్చల్లో ఈ విషయాలు ప్రస్తావించినట్లు తెలిపారు. సమావేశంలో వాల్మీకి, వినోద్, అచ్చన్న గౌడ్, వైండింగ్ రాములు ఉన్నారు.

ఘనంగా పీరు ఉత్సవం



ఊట్కూర్‌లో ఏర్పాటు చేసిన మౌలాలి సామిపీరు

అలంపూర్ రూరల్: అలంపూర్ మండలంలోని ఊట్కూర్‌లో రెండు రోజుల పాటు గురు, శుక్రవారం ఘనంగా జార్తుల పీరు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కులమతాలకు అతీతంగా గ్రామంలో ప్రజలందరు కలిసి కట్టుగా పీర్ల ఉత్సవం చేస్తున్నారు. మౌలాలి సామి పీరుకు భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం పీరును వైభవంగా ఊరేగించి నది లో నిమజ్జనం చేయనున్నట్లు మాజీ సర్పంచ్ నర్సన్‌గౌడ్, వెంకటేశ్వర నాయుడు, నర్సింహ నాయుడు, ఆంజనేయు లు, ఎం శ్రీనివాసులు, సలీంబాషా, నర్సింహ పాల్గొన్నారు.